# ఘటన

ఆ ఉత్తరం చదివి నిలువునా వణికి పోయింది అరుణ. ఈ విపరీతం ఆమె ఎప్పుడూ ఊహించలేదు. "ఎంత చిత్రంగా వుంది. ఘటన అంటే ఇదే కాబోలు. కానీ...కానీ...తను ధర్మం తప్పకూడదు ఏమైనాసరే. ఈ పరీక్షల్లో నెగ్గగలిగే శక్తి ప్రసాదించు భగవంతుడా!" అని వేడుకుంది.

"అసలిలా ఎందుకు జరిగింది?" అని సింహావలోకనం చేసుకుంటే...తను కాలేజీలో చదువుకునే రోజులూ ఆ తర్వాత నళినీ జ్ఞాపకం వచ్చారు.

తల్చుకుంటే ఎంత ఆశ్చర్యం కలుగుతోంది!

*  *  *

"చూడు నళినీ, జీవితంలో ఎన్నో చిందరవందర లుంటాయి. వాటిని ఎదుర్కొని నిలద్రొక్కుకో గలిగినప్పుడే మన మనుగడ సార్థక మవుతుంది. ఇలా క్రుంగిపోతే ఎలామరి?" అని బుజ్జగించింది అరుణ.

"కానీ...నా వాళ్ళే నన్నింత నిరాదరిస్తున్నప్పుడు నేను ఎవ్వరికీ అక్కర్లేనప్పుడు... అందరూ నన్ను పురుగుకంటె హీనంగా చూస్తున్నప్పుడు నేనెందుకు బ్రతకాలో చెప్పండి టీచర్," ఆవేదనగా అడిగింది నళిని.

"ఎందుకు బ్రతకాలీ? అని అడగటానికి మనకేం అధికారం వుంది నళినీ. దేవుని జేర్పగ జీవుని గొనిచను దేవదత్తమౌ దివ్యరథం మన శరీరం. దాన్ని నిర్లక్ష్యం చెయ్యడం నేను సహించలేను. నేను నీకేం చెప్పను? నాకేం పాండిత్యం వుంటేనీ? ఆఫ్టరాల్ బియ్యేబియ్యీడీని" అంటూ నిట్టూర్చింది అరుణ.

"అలా అంటారేమిటి టీచర్? మీరు ఏది చెప్పినా నాకు వేదవాక్యమే. ఎంత ఇష్టంగా వుంటుందనుకున్నారూ మిమ్మల్ని చూస్తుంటే, మీ మాటలు వింటూంటే," అన్నది నళిని ఉత్సాహంగా.

"బలేదానివే..." అంటూ చిన్నగా నవ్వింది అరుణ.

"మరే టీచర్! మీరు నవ్వుతూంటే..." మాటలు వెతుక్కోడానికేమో ఒక్క క్షణం ఆగింది నళిని.

"ఇవాళ ఇలా పట్టించావేం తల్లీ!" అంటూ నవ్వు దాచుకుంది అరుణ.

"మీకు ఎగతాళిగా ఉన్నట్టుంది...... పొండి," అంటూ బుంగమూతి పెట్టింది నళిని.

"ఈ అమ్మాయి తనబాధ మర్చిపోయి మాటల్లో పడింది. ఫర్వాలేదు," అనుకుంది అరుణ.

"సరేలే. నీ మాట ఒప్పుకున్నాను," అన్నది ఆప్యాయంగా.

"ఇంక వెళ్తానండీ. మీ దగ్గరవుంటే కాలం ఇట్టే గడిచిపోతుంది. గంటలు నిమిషాలై పోతాయి."

"ఈ మాట అనవలసింది నా దగ్గర కాదు నళినీ, ఫారెన్‌లో వున్నారే మీ బావగారు, ఆయన దగ్గర అనాలి," కొంటెగా అన్నది అరుణ.

కానీ ఆమె ఆశించినట్లు నళిని మొహంలో మధుర భావాలేవీ తారట్లాడలేదు. సిగ్గుతో ఆ పిల్ల మొహం ఎఱ్ఱబడి పోనూలేదు. చివుక్కు మన్నది అరుణ మనస్సు.

"ఆఁ పోదురూ. మా బావ దగ్గర ఇలాంటి మాటలేమిటి? నాకు చచ్చేంత విసుగు. అసలు తను డబ్బుకోసం ఆశపడే గదా నన్ను పెళ్ళి చేసుకోవటం," అన్నది నళిని నిర్లక్ష్యంగా.

"అదేమిటి?"

"అవునండీ. లేకపోతే అంతటి అందగాడు తనెక్కడ? నేనెక్కడ? డబ్బుకోసం కాకపోతే చూస్తూచూస్తూ నన్ను చేసుకోవటం దేనికి?"

"ఓస్ - అదా నీ అనుమానం?" అంటూ తేలిగ్గా నవ్వింది అరుణ.

"పిచ్చిపిల్లా! నువ్వు అనాకారివా? చామనచాయ అయితే మాత్రం - ఇంత చక్కని కేశభారం మరో తెల్లని అమ్మాయికి వుంటుందా? చెంపకి చేరడేసివున్న నీ విశాల నయనాలు మరో పచ్చటిపిల్లకి చూపించు చూద్దాం?" అని కూడా మందలించింది.

నళిని కేంమాట్లాడాలో తెలీలేదు.

"ఇంటికి వెళ్ళగానే మీ బావగారికి ఉత్తరం వ్రాయి. నిన్ను ఈ పరిస్థితుల్లోనించి తప్పించగలవాడూ కొత్త జీవితంలోకి తీసుకుపోగలవాడూ ఆయనొక్కడే. ఆ మాటమటుకు మర్చిపోకు" అని హెచ్చరించింది అరుణ.

"ఏం రాయమంటారు టీచర్? ఉత్త

ఓగేటి ఇందిరాదేవి

రాలు రాయటం నాకు సరిగ్గా రాదు" అని గునిసింది నళిని.

"అదేమన్న మాట! ఏదిరాసినాబాగానే వుంటుందే మన ఆత్మీయులంటే ఆపేక్ష పొంగులువారుతున్నప్పుడు. అదే కొంచెం కళాత్మకంగా రాయగలిగితే ఇంక చెప్పావూ? మీ బావగారు అంత దూరాన వున్నారాయె. ఇక్కడ నువ్వెలా వుంటున్నావో? ఏం చేస్తున్నావో? చుట్టూ జీవితం ఎలా వున్నదో? నీ స్నేహితులెలాంటివారో–ఇవ్వన్నీ రాస్తే ఆయనకు ఎంత సంతోషంగా వుంటుందోకదూ?" అన్నది అరుణ ఉత్సాహంగా.

"తెలిసిపోయింది. తెలిసిపోయింది" అని ఉత్సాహపడింది నళిని

"ఏమిటి ?"

"అదేనండీ – బావకు ఉత్తరం రాయడమే? ఇవాళ మనం మాట్లాడుకున్నదంతా రాసేస్తే సరిపోతుందిగదూ ?" అంటూ పరిగెత్తింది నళిని.

ఆ పిల్లను చూసి ముద్దుగా నవ్వుకుంది అరుణ.

ఆమె హైస్కూల్లో టీచర్. పాఠం బాగా చెప్తుందని ప్రఖ్యాతి. అందుకనే అరుణ దగ్గర చదువుకుంటూ మెట్రిక్ పరీక్షకు వెళ్తోంది నళిని.

ఇవాళ కబుర్ల మధ్య చాలా విషయాలు దొర్లాయి అనుకోకుండా.

"నిజమే టీచర్! ఆరోజు మా అక్కయ్య అన్ని మాట లంటూంటే చచ్చిపోవాలనిపించిందండీ!" అన్నది గద్గదస్వరంతో– నళిని.

"ఛ... ఛ... అవేం మాటలు నళినీ! అక్కయ్య కోప్పడినంత మాత్రానికే బ్రతుకు ముగించుకుంటే...ఇంకెలా? మన వివేకమంతా ఇంతేనా?" అని ఆశ్చర్యపోతూ...మందలించింది అరుణ.

"మీకు తెలీదు టీచర్! మీ అక్కయ్యలా వుంటారనుకుంటూరా మావాళ్లు? నేనంటే మా యింట్లో ఎవరికీ ఇష్టంలేదు. ఏడుగురక్కయ్యలూ అయిదుగురు తమ్ముళ్లూ వున్నారామరి. ఎవ్వరూ నాతో సరిగ్గా మాట్లాడరు. వెలివేసినట్లు చూస్తారు."

కనుబొమలు ముడించిచూసింది అరుణ.

"అదేమిటి నళినీ! ప్రేమకు హింస ఎదురవటం అసంభవమే మరి. మీ పెద్దక్కయ్యను అత్తవారు తీసుకెళ్ళటంలేదనీ, రెండోఅక్కకు పిల్లలు పుట్టలేదనీ–మూడో అక్కకు పెళ్ళికాలేదనీ–తమ్ముళ్ళకు చదువు రావటల్లేదనీ ఎప్పుడూ వాళ్ళ గురించే అనుకుంటూంటావు గదా? నువ్వంటే వాళ్ళకెందు కిష్టంలేదూ? ఇదేదో చిత్రంగానే వుంది!"

"ఏమోనండీ: నన్ను చిన్నప్పట్నుంచీ మా పెద్దమ్మగారు పెంచుకుని ఆవిడ ఆస్తి అంతా నాపేర రాశారు. నేను మేజర్ని కాగానే అదంతా నాచేతులోకి వస్తుంది. తమకెవరికీ లేని ఆస్తి నాకొక్కదానికే ఎందుకుండాలని – కుళ్ళు వాళ్ళకి"

"నీకెంత డబ్బు వస్తుందేమిటి ?"

"మాపెద్దమ్మ జవాహరీయే బోలెడుందండీ. సుక్షేత్రమైన పన్నెండెకరాల పొలం, బ్యాంకీలో యాభై వేలరూపాయల కాష్ – రెండు మంచిఇళ్ళు... ఇంకేవిటో ఉన్నాయిగాని నాకు అన్నీ గుర్తుండవు – ఎప్పుడోగదా వచ్చేది!" నిర్లిప్తంగా చెప్పి విడిచింది నళిని.

"ఎలా అయితేనేం? లక్ష దాటుతుంది; అమ్మో నళినీ, నువ్వు లక్షాధికారిణివి. నీపక్కన నేను ఇలా కూచోవచ్చునా ?" అంటూ నవ్వింది అరుణ.

నళిని మొహం మాడిపోయింది.

"ఊఁ అదుగో, మీరుకూడా అలా అంటున్నారు; అందుకే నాకు డబ్బు వస్తుందని సాధారణంగా ఎవరికీ చెప్పను. మా ఇంట్లోవాళ్ళూ అంతే. 'అదెక్కడమ్మా–లక్షాధికారి. దానితో మనం మాట్లాడాల్సిన అవసరమేముంది ?' అంటారు. డబ్బు వస్తుందేమటుకు ఆప్యాయతా అభిమానమూ అక్కర్లేదా నాకు? అందరు మనుషుల్లాంటి దాన్ని కానా నేను? ఆపేక్ష కోరుకోవ నాకున్నదేమిటి? మీరు చెప్పండి, టీచర్" కళ్ళల్లోనీళ్ళు చిప్పిల్లుతుండగా మానవత్వాన్నే సవాల్ చేసినట్లు అడిగింది నళిని.

"తమాషాకి అన్నానమ్మా తల్లీ! ఇంకెప్పుడూ అనను సరేనా?" అన్నది అరుణ ఇంచాక నవ పరిహాసానికి నొచ్చుకుంటూ.

"మీరుసరే ... కానీ మా అక్కయ్యలున్నారే వాళ్ళు..."

"వాళ్ళు... ?" ప్రశ్నార్థకంగా చూసింది అరుణ.

"నన్నెప్పటికీ వాళ్ళల్లో కలుపుకోరు. ఒకసారి ఏమైందంటే..." గొంతుబొంగురుపోయి మాటరావడం కష్టమైపోయింది నళినికి.

ఆమె సర్దుకునేవరకూ అలాగే చూస్తుండి పోయింది అరుణ.

"నాకు జ్వరంగావుంటే పెద్దక్కయ్యలిద్దరూ చూసిపోవడానికి వస్తే ఆశ్చర్యపోయాను. 'ఒసేచిట్టీ! జ్వరంలో ఈబరువు కూడా ఏంమోస్తావు. ఈరవ్వల దిద్దులు తీసేసి–తేలిగ్గావుంటాయి చిన్న నక్షత్రాలు పెట్టుకో. ఆ ముత్యాల ఉంగరం తీసేద్దూ సుఖంగావుంటుంది ప్రాణానికి. ఆ వజ్రాల నెక్లస్ దేనికి? బరువుచేటు – సింపిల్ గా ఉంగోలుసుచాలే' అంటూ మెల్లి మెల్లిగా నాసొమ్ములన్నీ ఒలిచింది పెద్దక్కయ్య. అవును ఆమాటనిజమే. అమ్మ అయినా చెప్పలేదే – అనుకున్నాను. తర్వాత ఆ వస్తువులు ఒక్కటీ మాఇంటికి తిరిగిరాలేదనుకోండి. అంతలో మా చిన్నక్కయ్య ఆప్యాయంగా పళ్ళరసం పట్టుకువచ్చింది. అంతకుముందు నాతోమాట్లాడని అక్కయ్యలు అంత ఆపేక్ష చూపిస్తూంటే అమాంతం ఉప్పొంగి పోయాను పిచ్చిమొహందాన్ని – కానీ మా పనిమనిషి పరిగెత్తుకుంటూవచ్చి 'ఆ పళ్ళరసం తాగకండమ్మా' అని చెప్పింది. 'ఎందుకే'

అంటే కారణం చెప్పదు. చివరికి తేలిం దేమిటంటే... అందులో ఏమీ లేదని... ఏమీ లేదని...''


"ఇంక చెప్పకు నళినీ! నేను వినలేక పోతున్నాను" అంటూ రెండు చెవులూ మూసుకున్నది అరుణ. భర్తలిద్దరూ ఆ వూళ్ళోనే ఉద్యోగాలవటంతో, కలిసివుంటే ఇంటద్దెతో పాటు ఖర్చులుకూడా కలిసి వస్తాయనే ఉద్దేశంతో తల్లిదండ్రుల దగ్గరే వుంటున్నారు అరుణ అక్కయ్య లిద్దరూ భర్తలతో కలిసి. అరుణకు ఒక్కడే తమ్ముడు కలిసింది. అతనుమటుకు హైదరాబాదులో హాస్టల్లో వుండి ఎమ్మే చదువుతున్నాడు. అతనొక్కడూ దూరంగా వున్నాడని ఇంట్లో అంతా గిలగిలలాడుతుంటారు. సెలవుల కోసం ఎదురు చూస్తుంటారు. ఆప్యాయతా వాత్సల్యం వెల్లివిరిసే కుటుంబంలో మసులుకుంటున్న ఆమెకు నళిని జీవితం విచిత్రంగా ఎందుకనిపించదు?

"నాకు ఆ వేదన కావాలి టీచర్! ఇంకేం అక్కర్లేదు. స్వచ్ఛమైన ఆప్యాయతకీ అనురాగానికీ మొహం వాచిపోయాను. నాకీ డబ్బు దేనికి? ఇదంతా పట్టుకెళ్ళి తుంగభద్రలో కలుపుదామన్పిస్తుంది" అంటూ ఆవురుమన్నది నళిని.

చటుక్కున ఆ పిల్లను దగ్గరికి తీసుకుంది అరుణ.

"నీ జీవితంలో లోపించిన ఆప్యాయతనూ, నువ్వు పోగొట్టుకున్న వాత్సల్యాన్నీ నీకు కొంచెమైనా ఇవ్వటానికి ప్రయత్నిస్తానమ్మా నళినీ! నన్ను నమ్ము — ధన ధాన్యాలూ పెట్టిపోతలూ నా వల్ల కాని పనులే అయినా ఆప్యాయతకేం లోటు? గుండెలనిండా ఉప్పొంగుతున్నది సదా— నేనొకమాట చెప్తాను విను. నాకు సొంత చెల్లెళ్ళు లేరని ఇంక ముందెప్పుడూ అనుకోను" అన్నది.

నళిని కనురెప్ప వెయ్యకుండా ఆమె వంకే చూసింది.




"ఏమిటి నళినీ, అలా చూస్తున్నావు? నామాట నమ్మటంలేదా?" అని అడిగింది అరుణ చిన్నబుచ్చుకుని.

"నాను టీచర్! కాదు. మీరు దేవతలు. మీ ఋణం ఎలా తీర్చుకోను నేను? ఈ జీవితంలో ఓ రోజున అయాచితంగా అంత ఆనందం దొరుకుతుందని నే నెప్పుడూ అనుకోలేదు — అందుకే గాబోలు నేను ఎన్నోసార్లు ఆత్మహత్యా ప్రయత్నాలు చేసినా దేవుడు నా నియ్యలేదు" అన్నది నళిని.

"ఆత్మహత్యా ప్రయత్నాలా? అలాంటి మాట నీనోట వింటున్నందుకు సిగ్గువేస్తోంది నాకు. ఇకపైన ఎప్పుడూ ఆమాట ఎత్తనని ప్రమాణంచెయ్యి నళినీ! ఊఁ, ఎన్ని అవాంతరా లొచ్చినా సరే నని..." అన్నది అరుణ కరుకుగా.

నళిని హృదయంలో కృతజ్ఞత వేయి విధాలుగా నర్తించింది.

ఒక రోజాది గడిచిపోయింది చూస్తుండగానే... అరుణ పరిరక్షణలో నళిని మనసు చాలావరకు వికసించింది. అరుణ పక్కే పడుకుని నళిని బ్రతుకు ఆనందాన్ని చూడగల్గినది. ఇపుడు బావ పేరెత్తితే నళిని అంతగా ఉలుక్కోవటంలేదు. పట్ట బలవంతాన నవ్వుకుంటూ, కసురుకుంటూ ఉభయకుశలోపరి — అందరూ క్షేమము. నీక్షేమము తెలుపవలసినది — చిత్తగించవలెను అంటూ రెండు ముక్కలు ఉత్తరాలు వ్రాసే నళిని— నెమ్మదిగా—కూర్పుగా— ఉద్విళ్ళూరించే లేఖలు రాయటం నేర్చుకుంది.

ఆ రోజు...గోపాల్ తిరిగి వస్తున్నాడు.

నళిని గబగబా వచ్చి ఆ విషయం టీచర్ కి గుర్తు చేసింది. "ఓహో, అవును గదూ! కాబోయే ప్రాణేశ్వరులు విచ్చేస్తున్నారు గాబోలు. ఏదీ ఇలారా! నీ హృదయం ఏమని పాడుతోందో విననీ. శతకోటి మన్మథాకారా! రాజా! రారా! స్వామిరారా! అని పాడుతోంది లే, నాకు తెల్సిందిలే" అంటూ సంతోషంగా చప్పట్లు కొట్టింది అరుణ.

"పోండి టీచర్! నాకసలు తను వస్తున్నట్టే గుర్తులేదు-పొద్దున అమ్మ పెంకిలాడి నిద్రలేపి చెప్పేదాకా" అంటూ తలవంచుకున్నది.

చప్పగాచల్లారిపోయింది ఒక్కసారిగా టీచర్ ఉత్సాహం.

"అదేమిటి నళినీ! నీకు రాత్రి అంతలా నిద్ర ఎలాపట్టింది? అంతదూరంనించి నీవాడు, నీ సర్వస్వం, రెక్కలుగట్టుకుని వచ్చి నీముందు వాలాలని ఎంత తపిస్తు

న్నాడోగాని - నీకుమాత్రం ఏమాత్రం స్పందనా లేదన్నమాట-ఇలా నా మొహం చూసి నిజంచెప్పు. నీ మనస్సు మధురోహల్లో తేలిపోవడంలేదూ? 'అబ్బా! ఈ గడియారం ఇంకా ఇలా నింపాదిగా తిరుగుతోందేం, బావ ఎప్పుడు వస్తాడు? ఎప్పుడు కళ్ళారా చూస్తాను' అని తహతహ లాడటంలేదూ? - నీ భావాలన్నీ నాకైనా చెప్పకుండా దాచుకుంటున్నావు గదూ? ఔరా? అయినా నీకు మేమెవరంలే శ్రీవారిముందర - ఎందుకూ పనికిరాం. అవునా?" అంటూ మళ్ళీ రెట్టించింది.

"అబ్బ! ఏవిఁటేవిటో అంటున్నారు. నాకేం తెలీ వసలవి. శుభ్రంగా నిద్రపోయి లేచాను-కానీ-మరండీ-మీరట్లామాట్లాడుతుంటే ఏవిఁటో ఇష్టంగా వుంది - మళ్ళీ - మళ్ళీ వినాలనిపిస్తోంది" అంటూ సన్నగా సిగ్గుపడింది నళిని.

"పిచ్చిపిల్లా! ఇప్పుడర్థమైందా? నీకు తెలీకుండానే నీ మనస్సులో దాక్కుని వున్న ఊహలు ఇవి. ఇప్పుడూ ఆడపిల్లలా-మనోహరంగా కన్పిస్తున్నావు. ఆ బుగ్గల మీద ఎరుపు-ఆ కళ్ళల్లోని మెరుపు అలాగే నిలుపుకోవాలిసుమా. మీ బావగారు కారు దిగేసరికి అయస్కాంతంలా తక్కున ఆకట్టుకోవాలి" అని మేలమాడింది అరుణ.

నిజానికి అరుణ అన్నంత 'ఇది'గా ఏమీ లేదు నళిని - కానీ అలా ఉండటం అరుణ అభిమతం - తను అలా అంటే ఆమెలో ఆ మార్పు వస్తుందేమోనని ఆశపడి చివరి ప్రయత్నం చేసింది. ఆ రాబోయే గోపాల్ మీద విపరీతమైన జాలివేసింది అరుణకు ఇందాకటినించీ.

మొత్తంమీద ఆమె ఆశించిన పరిణామం ఎదురైంది.

"ఏమిటి టీచర్! మీరు మరీనూ!" అంటూ రెండుచేతుల్లో మొహం దాచుకుంది నళిని.

లాలనగా ఆ అరిచేతులు విప్పిచూసింది అరుణ - పల్చగా, తెల్లగా కోమలికంగా వుందా చెయ్యి-సన్నటి పొడుగాటి వేళ్ళు, రంగువేసిన నిగనిగలాడుతున్న గోళ్ళు. కళ్ళవేపుచూసింది పెద్దపెద్ద కళ్ళు-కాటుక లేకపోయినా నల్లగా మెరుస్తున్నాయి. నుదురువేపు చూసింది. కన్పించీకన్పించకుండా గులాబీరంగు చిన్నబొట్టు-నెత్తి మీద ఎత్తుగా అదేదో తమాషాగా హెయిర్‌స్టయిల్. ధగధగలాడుతున్న పసుపుపచ్చరంగు పల్చని ఫారెన్ నైలాన్ చీర-కుచ్చెళ్ళన్నీ ఒకపక్కకు చేర్చి పిన్ను పెట్టింది...ఆ ఆహార్యం అంతా చూశాక అరుణ మళ్ళీ ఉసూరుమన్నది. కానీ అసంతృప్తిని లోపల్లోపలే అణిచివేసుకుని "ఫారెన్ వెళ్ళొచ్చిన పెళ్ళికొడుకాయె మరి. ఇలాగే వుండాలేమో భార్య-" అని తృప్తిపడింది.

తనను పరిశీలిస్తున్న అరుణని విచిత్రంగా చూసింది నళిని. అక్కయ్యలు రుబ్బిపెట్టిన గోరింటాకువల్ల ఎఱ్ఱగా, మెరుస్తున్నాయి అరచేతులూ గోళ్ళూ. కళ్ళకు కాటుకా, నుదుట ఎఱ్ఱని గుండ్రని బొట్టు తీర్చిదిద్దినట్లున్న కనుబొమలూ-సన్నని నడుమూ-తెల్లని వాయిల్‌చీరా - తెల్లని జాకెట్, తల అంటుకోవడంవల్ల వదులుగా వేసుకున్న జడలో పువ్వులూ, మెళ్ళో సన్నటి ముత్యాలగొలుసూ...పులుగడిగిన ముత్యంలా స్వచ్ఛంగా-కాంతిగా వున్నది అరుణ.

ఒక్కసారి ఘక్కుమన్నారు గురుశిష్యులిద్దరూ.

"సరేగాని-ఇంకా ఇక్కడే కూర్చున్నావేమిటి? త్వరగా వెళ్ళుమరి. మీ బావగారి కళ్ళు అటూఇటూ వెతుకుతుంటాయి ఈ పాటికి" అన్నది అరుణ నవ్వటం ఆపి.

"తను ఇప్పుడే రాడుగానీ...నన్ను వెళ్ళమంటున్నా రెక్కడికి?" అని అడిగింది నళిని ఆశ్చర్యంగా.

"అయ్యో ఖర్మ!" అన్నట్లు నుదురు కొట్టుకున్నది అరుణ.

బిక్కమొహం వేసింది నళిని.

"అదికాదమ్మా నళినీ! మీ బావగార్ని రిసీవ్ చేసుకోవడానికి వెళ్ళవూ? ఊళ్ళో వాళ్ళే పెద్దయెత్తున ఆహ్వాన ప్రయత్నాలు చేస్తున్నారుగాబోలు. అలాంటప్పుడు ఆయన స్వీట్‌హార్ట్‌వి నువ్వు వెళ్ళవూ?" అని అడిగింది అరుణ ఆదుర్దాగా.

"పోదురూ! నాకు చిరాకు. ఊళ్ళోకి వచ్చినవాడు ఇంటికి రాలేడాయేం?" అని చప్పరించింది నళిని.

అరుణ విలవిల మొత్తుకుని నచ్చజెప్తే అప్పుడు - ఒప్పుకుంది గానీ... "మీరూ రండైతే. నేనొక్కదాన్నే వెళ్ళలేను..." అన్నది.

"ఇస్సు - ఏం పిల్లవు నువ్వు. పెళ్ళిపీటల మీద కూడా తోడు కూర్చోమంటావా ఏమిటి నన్ను? మీ అక్కయ్యలనో, అమ్మగారినో రమ్మనమ్మా బాబూ? ఊఁ, వేళైంది-తొందరగా కదులిక్కణ్ణుంచీ..." అని హడావుడి పడింది అరుణ.

"ఆయనేవుంటే విస్తరాకెందు కన్నారుట వెనకటికెవరో. మా అక్కయ్యలూ అమ్మావస్తే ఇహ చెప్పుకోవాల్సిందేముంది? మీరేరండి టీచర్!" అని బ్రతిమలాడిందది నళిని.

"అబ్బ! ఏం ఉపమానం దొరికిందితల్లీ! చాల్లేగాని నాకు తప్పదంటావు; సరేపద!" అంటూ ఆదరా బాదరాగా వాచ్ పెట్టుకుని జోళ్ళు తొడుక్కుంది అరుణ.

"అదేమిటండీ - అక్కడికి చాలామంది వస్తారు. మీరుకాస్త తయారవండి" అన్నది నళిని ఆమె చీరవంక సాభిప్రాయంగా చూస్తూ.

"ఇంకేం తయారవమంటావు! అదేదో నువ్వు తయారవుదువుగాని పద" అంటూ కుచ్చెళ్ళు సవరించుకుని పమిట సర్దుకుంది అరుణ నవ్వేస్తూ.

"మరీ - మీరు ఆ క్రీష్ణకలర్ సిల్కుచీర కట్టుకోండీ. మీతెల్లని ఒంటిమీద ఆచీర మెరుస్తూంటే ఎంతబావుంటారో మీరు !" అని ఉత్సాహపడింది నళిని.

"చాల్చాల్లే - ఎవరైనావింటే నవ్వుతారు. నీకు రసస్పందనంటూ ఎప్పటికి కలుగుతుందోగాని దుంప తెంపుతున్నావు. అవతల మీబావగారు వస్తూంటే నన్ను ముస్తాబు చేస్తానంటావేమిటి? తలకాయ పనిచేస్తోందా అసలు? ఆయన అందాలు ఊహించుకోవటం మానేసి నా అందం ఊహించుకుంటున్నావు పైగా - ప్చ్ - ఆయనగారు నీతో ఎలా వేగుతారోగాని" అని కోప్పడింది అరుణ - కనీసం కోప్పడితేనైనా తెలుస్తుందేమోనని.

బుంగమూతి పెట్టుక్కూచుంది నళిని.

అలా ఆపిల్లను చూస్తూంటే మళ్ళీ అరుణగుండె కరిగిపోతుంది.

"ఇదుగో నళినీ! నీకోపం నాదగ్గిర చూపిస్తే లాభంలేదు - తర్వాత అవసరం వస్తుంది దాచుకో. ఏమంటావింతకీ - చీర మార్చమనేనా? ఈచీర ఇందాకే కట్టుకున్నాను. దీనికేమొచ్చింది - అసలే ఆలస్యమైంది పద. పద..." బయల్దేరింది అరుణ.


*    *    *

అభినందనలూ వగైరా హంగామా అంతా పూర్తయ్యాక బావదగ్గరికి వెళ్ళింది నళిని.

"ఈవిడే బావా! అరుణా టీచర్. ఈవిడను చూడాలని ఎంతో కుతూహలపడ్డావుగా ఉత్తరాల్లో," అంటూ పరిచయంచేసింది. ఇంక అంతకంటే ముఖ్యమైన సంగతేం లేనట్టు మహాసంతోషంతో.

నమస్కార ప్రతినమస్కారాలైనాయి.

"ఈమధ్య మరీ ప్రతి ఉత్తరంలోనూ మీ గురించే రాస్తోందండీ నళిని. తనని చాలా మార్చేశారు మీరు. కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను" అన్నాడు గోపాల్ నవ్వుతూ.




"నళిని చెప్పినమాటలు నిజమే. ఇతను చాలా అందంగా వుంటాడు ముఖ్యంగా నవ్వుతున్నప్పుడు...అదుగో ఆ పలువరసే కారణం..." అనుకుంది అరుణ అప్రయత్నంగా. "ఛీ-ఇదేమిటి? ఇలా ఆలోచిస్తున్నాను?" అని అంతలో తనను తాను మందలించుకుని అన్నది;

"నేనేం మార్చలేదండీ - స్వతహాగా చురుకైన అమ్మాయి నళిని. కాస్త ఏదైనా అందిస్తేచాలు అల్లుకుపోతుంది. తనకే అతిశయోక్తులు చేతనవుననుకున్నాను - మీరు ఆమెను మించిపోయారే" అంటూ స్నిగ్ధంగా మందహాసం చేసింది అరుణ.

"మరి! అమెరికా వెళ్ళివచ్చిందెందుకనుకున్నారు? రెండాకులెక్కువ చదవటానికే" అన్నాడు గోపాల్.

"ఊహూఁ పొగడటం నేర్చుకువచ్చారన్నమాట. బాగానేవుందిగాని...మాఇంటికొకసారిరండి మీరిద్దరూ కలిసి. ఏం నళినీ?" అంటూ ఆమెవైపు చూసింది అరుణ.

"ఏం బావా! వెళ్దామా? టీచరుగారింటికి?" అంటూ బావవైపు చూసింది నళిని.

"వెళ్దాం-" అన్నాడతను నవ్వుతున్న కళ్ళతో.

"ఎక్కడ? ఎక్కడచూశానీయన్ని?" అనుకుంది అరుణ తడబడిన మనస్సుతో.

తర్వాత కాస్సేపు కూర్చుని వెళ్ళిపోయింది.

అయిదారురోజుల తర్వాత...

తలుపు చప్పుడైతే వెళ్ళితీసింది అరుణ. ఎదురుగా ప్రఫుల్లవదనంతో గోపాల్.

"అరుణ మొహంలో ఆనందం చిందులు తొక్కింది.

"అరె! మీరా! నళినేదీ! దాచేశారా ఏమిటి?" అంటూ సంభ్రమంగా అటూ ఇటూ చూసింది.

"ఒక్కడినీ వస్తే లోపలికి రానివ్వరా ఏం?" అన్నాడతను నిస్తేజంగా.

"అబ్బె-అదేమిటి! రండి లోపలికి. మీరు మా ఇంటికి రావడం మా అదృష్టం."

"మొన్న వచ్చానుగా."

"అదే-నళిని బలవంతం చేసి తీసుకొచ్చిందేమో ననుకున్నాను."

"నేనే బలవంతంచేసి నళినిని తీసుకొచ్చాననుకోరాదూ?"

అరుణ మొహం కందగడ్డయిపోయింది.

"ఇంతకూ తనేదీ? కులాసాగా వుంది కదా?" మొహం పక్కకు తిప్పుకుని ఆదుర్దా పడింది.

"ఎదురుగా వున్న వాళ్ళను వదిలేసి ఇంకెవరిగురించో మాట్లాడటమంటే సరదానా అరుణా! మీకు?"

"ఇంకెవరి గురించోనా? అంటే... అంటే... నళినిని పరోక్షంలోకూడా పరిహాసం చేస్తున్నారా ఏవిటి బాబూ!" అన్నది అరుణ నవ్వు తెచ్చుకుంటూ.

విసుగ్గా తలపట్టుకుని రెండు కణతలూ వత్తుకున్నాడతడు.

అరుణ మనసులో ఏదో అనుమానం మెదిలింది. గుండె ఝల్లుమన్నది.

"తలనొప్పిగా వున్నట్లుంది. వేడికాఫీ తెస్తానుండండి," అంటూ చటుక్కున లేచి నిలబడింది.

ఆమెను కళ్ళనిండుగా చూశాడతను.

వెన్నెలకు వడగొట్టిపోతుందేమో ననిపించే సుకుమార శరీరంతో, నిరాభరణాభిరామంగా వున్నది అరుణ. పైగా ఆరోజు నళిని ముచ్చటపడిన క్రీష్ణకలర్ చీర కట్టుకుని వున్నది.

నిశ్శబ్దంగా నిట్టూర్చాడతను.

"చిన్నక్కా. అర్జెంటుగా కాఫీ కలపాలి," అంటూ హడావుడిగా వెళ్ళి అడిగింది అరుణ వంటింట్లో వున్న రమణి దగ్గరకి వెళ్ళి.

"ఎవరే చెల్లీ! ఆ వచ్చినాయన? అంత బావున్నాడు? నిన్ను చూస్తున్నంతసేపూ అతని కళ్ళల్లో ఆ మెరుపేమిటే?" అంటూ లోపలికి వచ్చింది వనజ — అరుణ పెద్దక్కయ్య.

"చూశావా? చూశావా? నాకు చెప్పనేలేదు, అంత చక్కని ఫ్రెండ్ వున్నాడని—ఎంత గడుసుదానివై పోయావే చెల్లీ!" అని ఆశ్చర్యపోయింది రమణి.

అరుణ మొహం మరీ ఎరుపెక్కిపోయింది.

"ఏంవిటక్కయ్యా! ఏమంటున్నారు మిరిద్దరూ? అతను...అతను..." ఆవేశంలో తడబాటుపడి మాట పూర్తిచెయ్యలేకపోయింది అరుణ.

క్షణం వ్యవధానం లేకుండా ఆమె గొంతును అనుకరిస్తూ అందుకుంది వనజ. "అతను... అతను ఎవరో వేరే చెప్పాలా చెల్లీ? నీ మొహం చూస్తేనే తెలిసిపోతోందిలే. ఏమే రమణీ! మనం ఎరిగున్నంతలో అరుణ మొహం ఇలా అయిందిటే ఎప్పుడైనా?" అంటూ కొంటెగా నవ్వింది.

"హరి భగవంతుడా! ఇదేమి టక్కయ్యా! ఇవాళ ఇలా మొదలుపెట్టారు? ఆయన నళినికి కాబోయే భర్త. వేపకాయంత వెర్రి ఏమైనా వుందేమో మహానుభావుడికి, కాబోయే భార్యను వదిలేసి మనింటికి వచ్చాడు. నా మొహం ఎఱ్ఱబడింది సిగ్గుతో కాదు కోపంతో," అని గట్టిగా అరవాలనిపించింది అరుణకి.

ఆమె అనబోయేలోపలే చిన్నక్క అన్నది: "నువ్వెళ్ళి అతనితో మాట్లాడుతుండవే అరూ! ఏదైనా టిఫిన్ కూడా చేసి కాఫీ తెస్తాంలే మేము, పాపం ఒంటరిగా కూర్చున్నాడతను."

"అవును పాపంఒంటరిగానే కూర్చున్నాడు. నళిని పక్కన లేకపోతే అంతే మరి. అలా చూస్తారేం? మొన్న మీరంతా గుళ్ళోకి వెళ్ళినప్పుడు అతనూ నళినీ కలిసి మనింటికి వచ్చారు, చాలా హాయిగా గడిపామని చెప్పానుగా. ఆయనే ఈయన. సరే తొందరగా కాఫీతెండి" అంటూ గబుక్కున ఇవతలికి వచ్చేసింది అరుణ.

వనజా రమణీ మొహామొహాలు చూసుకుని సిగ్గుపడి తలలు వాల్చుకున్నారు.

ఇందాక లోపలికి వెళ్ళిన అరుణకీ ఇప్పటి అరుణకీ ఎంతో తేడా వుంది. ఇంతలో ఏమైందీమెకి? అనుకున్నాడు గోపాల్.

"ఊరికే కూర్చున్నారేమిటీ? ఏమైనా కబుర్లుచెప్పండీ — మీకు ఢిల్లీలో ఉద్యోగం వచ్చిందన్నారుగదూ — ఎప్పుడు జాయినవుతున్నారు?" ముంగురులు అలవోకగా పైకి తోసుకుంటూ అడిగింది అరుణ. ఎందుకో తెలీదుగాని ఆమెచెక్కిళ్ళు అదురుతున్నాయి — పెదవులు వణుకుతున్నాయి.

"ఏమిటీ?" అన్నాడతను.

"బావుంది మీ పరధ్యానం — ఎవరి గురించీ అంతలా ఆలోచిస్తున్నారు."

"ఉహూఁ ఆలోచించటంలేదు. తదేకంగా చూడ్డమే చేస్తున్నాను. ఊఁ ఇంతకీ ఏమిటడిగారిందాక?"

"ఏంలేదు — ఢిల్లీ ఎప్పుడు వెళ్తారని అడిగానంతే" కళ్ళు వాల్చుకుంటూ అన్నది.

"వెళ్తానండీ పదిరోజుల్లో — ఎనిమిదో తేదీన జాయినవ్వాలి."

"నళినిని తీసుకెళ్తున్నారన్నమాట — ముహూర్తం అయిదోతేదీన కుదిరింపను కుంటాను — అసలు మీరు చాలా అదృష్టవంతులండీ. ఇంచక్కా ఫారెన్ వెళ్ళివచ్చారా? గుణమూ, ఆస్తీ — అందమూగల అమ్మాయిని పెళ్ళి చేసుకుంటున్నారా? ఓహ్ —"

"అబ్బ! నళిని...నళిని... చంపేస్తున్నారండీ నన్ను. నళినిమూలంగా తప్పనాదంటూ ప్రత్యేకంగా వ్యక్తిత్వమే లేదా మీదృష్టిలో? నాతో ఇంకే విషయమూ మాట్లాడకూడదా? ఇంటిదగ్గర ఆ బోరు భరించలేక నేనిటువస్తే మీరూ అదే మొదలెట్టారేమండీ" అని ఆవేశపడ్డాడు గోపాల్.

అరుణ ఖంగారుపడి — సంబాళించుకుని అన్నది:

"క్షమించండి — నళినివల్లనే గదా మీరు నాకు తెలిసింది."

"అది నా దురదృష్టం"

"నాకర్థం కావడంలేదు. కాస్త వివరంగా చెప్పండి."

"ఉహూఁ చెప్పను. చెప్పలేను. మీరు లోకజ్ఞానంకలవారు. నన్ను అర్థంచేసుకుంటారు అనుకున్నాను. ప్చ్ — లాభంలేదు.

క్షమించండి. నే వెళ్తున్నాను" అంటూ గబగబా వెళ్ళిపోయా డతను.

అమాంతం కుర్చీలో కూలబడిపోయింది అరుణ.

అప్పుడే కాఫీ టిఫిన్ పట్టుకొచ్చిన రమణి విస్తుపోయింది.

"అలా వెళ్ళిపోతున్నా రేమే ఆయన, ఏమన్నా వే? అయ్యో! నువ్వేమిటి అలా వున్నావు?" అంటూ గబుక్కున అరుణ దగ్గరికి వచ్చింది. అంతులేని భావసంచల నంతో అక్కయ్య భుజంమీద తల ఆన్చింది అరుణ.

తర్వాత నళిని వచ్చింది.

కాస్సేపు పటపటాయించి నెమ్మదిగా అడిగింది.

"ఇంట్లో ఎవరితో సరిగా మాట్లాడట ల్లేదండీ మా బావ. ఇదివరకు తనకసలు కోపమే వచ్చేదికాదు. ఎంతో సరదాగా ఉండేవాడు. పైగా నేను చలాకీ గా వుండకపోతే కోప్పడేవాడు. ఇప్పుడుబాగా మారిపోయాడండీ. నేను పలకరించినా విసుక్కుంటున్నాడు. అస్తమానం తలు పులు బిగించుకుని గదిలో కూచుంటు న్నాడు" అన్నది.


"నన్నేం చెయ్యమంటావు అయితే?" ఎటో చూస్తూ ప్రశ్నించింది అరుణ.

కళ్ళు ఇంతింతలు చేసుకుని చూసింది నళిని. ఆమె ఉదాసీనత ఆ పిల్ల కర్థం కాలేదు.

కాస్సేపటికి ఇలా అడిగింది.

"మా బావను ఎలా మాట్లాడించాలో తెలీటల్లేదు. ఏంచేస్తే మా బావ నవ్వుతాడు? ఇదివరకులా మాట్లాడుతాడు? చెప్పండి టీచర్ –"

"అదేమి ప్రశ్న నళినీ! ఆయన మన సెరిగి నడుచుకో. నీ ఆపేక్ష, అనురాగా లతో, నీ హావభావాలతో ఆయన మన స్సును ఆకట్టుకో. నీ మనస్సును సంపూ ర్ణంగా సమర్పించుకుని ఆయనకి చేరువ కా. నీ చాకచక్యంతో, ముఖ్యంగా నీ గాఢా




నురాగంతో, నీ మంచితనంతో ఆయన్ని నీవాణ్ణి చేసుకో. ఇలాంటివి ఎవరికివారే తెలుసుకోవాల్సిన విషయాలసలు. పరాయి దాన్ని – నేనెలా చెప్పను?" చిరాకుగా అన్నది అరుణ.

"అబ్బ! అవ్వన్నీ నాకు తెలీవు. మీరే అలా నడుచుకుని బావను నవ్వించండి టీచర్! ప్లీజ్!" గోముగా అడిగింది నళిని.

హఠాత్తుగా ఎవరో వచ్చి చెంపదెబ్బ కొట్టినట్లు ఉలిక్కిపడింది ఆ టీచర్.

"ఎలా చెప్తే అర్థమౌతుంది నళినీ నీకు? మీ బావగారూ నువ్వూ కలిసి నా ప్రాణం తీస్తున్నారు. నాకు డబ్బు లేకపోవచ్చు. అంతమాత్రాన ఇలా క్షోభపెట్టడం తగు నటమ్మా? చెప్పండి, నేను మీకేం అపకారం చేశాను? ఎందుకిలా ఏడిపిస్తున్నారు నన్ను?" అంటూ గిలగిలలాడింది.

"పొరపాటుచేశానా టీచర్! క్షమిం చండి. మిమ్మల్నింత నొప్పిస్తాననుకోలే దండి. ప్రతి విషయమూ మీ సలహాలేనిదే కుదరటల్లేదుగదా ఈ మధ్య నాకు. ఇదీ అలాగే అనుకున్నాను" అన్నది నళిని ఖిన్న వదనంతో.

"ప్చ్ – ఏమిటో – నా మనసు సరిగ్గా లేదమ్మా – నే నేం మాట్లాడుతున్నానో నాకే తెలీటల్లేదు. అనవసరంగా విసుక్కు న్నాను నిన్ను – ఏమనుకోకు," అన్నది అరుణ గుండెల్లో తొణికిసలాడే పశ్చాత్తా పంతో.

"ఫర్వాలేదండీ! మీరు రెస్టుతీసుకోండి– నేను వెళ్తాను" అంటూ బయల్దేరింది నళిని.

ఇంటికి వెళ్ళగానే బావదగ్గరికివెళ్లింది. ఎఱ్ఱబడిన కళ్ళతో, వాడిన మొహంతో, రేగిన జుట్టుతో అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు గోపాల్. నళినిని చూసి ప్రశ్నార్థకంగా మొహం చిట్లించాడు.

దిగులుగా నవ్వి "నీ గదిలోకి రావ చ్చునా బావా!" అని అడిగింది నళిని.

"బలేదానివే. నా గది అంటూ వేరే ఎక్కడిది ఈ ఇంట్లో. ఇది నీ గదే కదూ నళినీ! నీకు అడ్డు ఏముంది?" అన్నా డతను.

"ఎప్పుడూ అలా అనుకుంటావేం బావా! నీ కేం తక్కువని, నిన్ను నువ్వలా కించపరుచుకుంటావు?" అంటూ లోపలికి వచ్చిందామె.

"మరి? నాకింత చదువురావటానికి, నన్ను అమెరికా పంపించడానికి కారణ మైన నిన్నూ, నువ్వు నాకు చేసిన ఉపకా రాన్నీ ఎప్పుడూ స్మరించుకుంటూ ఉండ టం తప్పా నళినీ? మానవుడిగా అది నా కనీస ధర్మం" అన్నాడతను.

భారంగా నిట్టూర్చింది నళిని.

''బావా, నే నొక్క మాట అడగనా? మనస్ఫూర్తిగా చెప్పు బావా! నన్ను పెళ్ళి చేసుకోవటం నీ కిష్టమేనా?" తలవంచుకుని అడిగేసింది.

"నళినీ !"

"ఆల్ రైట్ – నిర్బంధమేం లేదు. నిర్బంధంతో చేసుకునే పెళ్ళి నాకు అఖ్ఖర్లేదు. కానీ బావా! నన్ను మర్చిపోతావు గదూ." ముందు బింకంగా అన్నా చివరిమాట దగ్గరికి వచ్చేసరికి గొంతు వణికింది.

''అదేం మాట నళినీ! నా కింత విద్యాబిక్ష పెట్టినదానివి నిన్ను మర్చిపోతానా? నన్ను మన్నించు. నా ప్రమేయం లేకుండానే నీలో ఆశలు కలిగిస్తే... మనస్ఫూర్తిగా చెప్తున్నాను. దయచేసి అర్థం చేసుకో. నువ్వంటే నాకు ఇష్టమే కానీ... అనురాగం కాదు. బలవంతాన చేసుకుని ఏం సుఖపెట్టగలను నిన్ను? నేనేం సుఖపడను? ఈ విషయం నీ కెలా చెప్పటమా అని తల బద్దలు కొట్టుకుంటున్నాను. ఇప్పుడు నువ్వే ఆప్రసక్తి తీసుకువచ్చావు. ఒక్కమాట నమ్ము – నీకు నే నెప్పుడూ ఋణపడి వుంటాను. ఇంటి ఆడబడుచుగా చూసుకుంటాను నిన్ను. ఏం? ఊఁ అను నళినీ!" సంతప్తస్వరంతో అడిగాడు గోపాల్.

పేలవంగా నవ్వేసి ఇవతలికి వచ్చిందామె.

"అయిపోయింది. యీ దిక్కుకూడా పోయింది. తనని ఈ ఇంట్లోనించి తీసుకువెళ్ళే వెలుగు దివ్వెకాస్తా ఆరిపోతోంది. అయిదేళ్ళనించీ తనతో మాట్లాడని మూడో అక్కా, తన ఉనికినే అసహ్యించుకునే తమ్ముళ్ళూ వీళ్ళమధ్యనించి తప్పించుకోవటానికి వీలేలేదు. అవివాహిత అయిన ఆడపిల్ల ఈబోనులాంటి ఇంట్లోనించి ఎలా తప్పించుకుపోతుంది?

ఈ క్షోభ ఎవరికి తెలుస్తుందసలు?

*       *       *

''అరుణా!

నమస్తే –

మీకు నామీద కోపంగా వుండి ఉంటుంది. దయచేసి ఈ ఉత్తరం మటుకు పూర్తిగా చదవండి – నా ప్రవర్తనకు అర్థం తెలుస్తుంది. ఆ తర్వాత మీ ఇష్టం.

నేను పుట్టంగానే జన్మనిచ్చిన అమ్మను పోగొట్టుకున్నాను. తర్వాత సవతితల్లి పెంపకంలో తొమ్మిదేళ్ళు పెరిగాను. ఆవిడా రక్తమాంసాలుగల మనిషేగదా – నాన్నకంటె ఇరవైరెండేళ్ళు చిన్నది. ఆవిడ అసంతృప్తికీ, కసికీ నేను కేంద్రం అయినానంటే అతిశయోక్తి కాదు. తొమ్మిదేళ్ళకే జీవితంలో పరమ నికృష్టమైన అవస్థ కూడా అనుభవించాను ఆవిడ దగ్గర.

అప్పుడు మా మామయ్య – అంటే నళిని నాన్నగారు నన్ను వాళ్ళింటికి తీసుకువచ్చారు. హైస్కూల్లో చేర్పించారు. అత్తయ్య దేవతలాంటి మనిషి. మా ఇంట్లోకంటే మామయ్యగారింట్లోనే హాయిగా వుండేది నాకు. కానీ పరాయివాళ్ళింట్లో వుంటున్నాననీ, వాళ్ళతిండి తింటున్నాననీ, వాళ్ళకెంతో ఋణపడి వున్నాననీ ఎప్పుడూ అనుకుంటూ లోపల్లోపలే బాధపడేవాడిని. అవకాశం రావాలేగాని అణాపైసలతో సహా ఋణం తీర్చుకోవాలని తహతహలాడేవాడిని. అప్పటి నా స్థితిని ఊహించుకోగలరా అరుణా మీరు!

అప్పుడు నళిని మద్రాసులో వాళ్ళ పెద్దమ్మగారి దగ్గర వుండేది. ఆ పెద్దమ్మా పెదనాన్నా ప్రాణప్రదంగా చూసుకునే వాళ్ళు తనని. ఎప్పుడన్నా ఏడాదికో రెండేళ్ళకో వచ్చి పట్టబలవంతాన నాలుగు రోజులుండి వెళ్ళిపోయేది మద్రాసుకి. కారుంటేతప్ప ఇల్లు కదిలేదికాదు. ఆమె దర్జానూ, దర్పాన్నీ చూసి నేను విచలితుడినై పోతుండేవాడిని. ఇంట్లో అక్కయ్యలతో తమ్ముళ్ళతోనే చాలా ముక్తసరిగా వాళ్ళెవరో తనకు కేవలం పరిచయస్థులు మాత్రమే అన్నట్లు ప్రవర్తించేది. ఇంక నాతో ఏం మాట్లాడుతుంది? ఇంట్లో రాముడని ఒక నౌకరుండేవాడు – అతనెంతో నేనూ అంతే ఆమెదృష్టిలో.

అరుణా! ఉన్నది ఉన్నట్టు రాస్తున్నాను. అతిశయోక్తి అనుకోకండి. నా మనస్సు విప్పి మీ ముందు పెడుతున్నాను– సానుభూతిని వాంఛించికాదు. యథార్థం తెలిసేటందుకు మాత్రమే.

నేను ఎస్సెల్సీ ప్యాసైన సంవత్సరం అనుకుంటాను – దురదృష్టవశాత్తూ కారు ప్రమాదంలో నళిని పెద్దమ్మా పెదనాన్నగారూ ఇద్దరూ పోయారు. మామయ్య వెళ్ళి నళినిని ఇంటికి తీసుకువచ్చేశారు. అపారమైన పెద్దమ్మ వాత్సల్యం ముందు మిగిలినవారి ఆపేక్ష ఎందుకూ పనికివచ్చేది కాదు నళినికి. అట్లాంటిది ఇప్పుడు ఆప్యాయతకోసం మొహం వాచిపోయే స్థితికి వచ్చింది. పూర్వపు నళిని ప్రవర్తననూ ఆ అహంభావాన్నీ మటుకు ఇంట్లోవాళ్ళెవరూ మర్చిపోలేదు. తమకందరికీ రాని ఆస్తి ఆ పిల్లకు రావటం సహజంగా అసూయకుకూడా కారణమైంది. మామయ్యా అత్తయ్యా తప్ప మిగిలినవాళ్ళందరూ నళినితో చాలా ముభావంగా ఉండేవాళ్ళు. చాటుమాటున తనని ఈసడించుకునేవాళ్ళు అనుకుంటాను.

నళిని ఎంతో బాధపడేది ఇందుకు. 'బావా! నువ్వెంతో మంచివాడివి. వాళ్ళెవరూ నాతో మాట్లాడటంలేదు చూశావా! నువ్వైనా మాట్లాడతావా బావా!' అని ఆశగా అడిగేది. నా కూడా కూడా తిరిగేది. వాళ్ళింట్లో తిని వాళ్ళ డబ్బుతో చదువుకుని పెరుగుతున్నవాడిని. ఋణం వుండనే వున్నది. దానికి తోడు ఆ పిల్లను చూస్తే నాకు జాలివేసేది. రోజూ ఏవోకబుర్లు చెపుతూండేవాడిని. జీవితం నిరాశకోసమే ఏర్పడలేదనీ, ఆశతో బ్రతకటం మనుషుల ధర్మమనీ, భగవంతుడు దయామయుడనీ నా ఉద్దేశం

చిన్నప్పట్నించీ. ఆ మాటే నళినికి రోజూ చెప్పేవాణ్ణి. తను ఇంట్లోనే వుండేదేమో నేను కాలేజీనించీ ఎప్పుడు వస్తానా అని ఎదురు చూస్తుండేది. నావల్ల తనకు సంతోషం కలుగుతున్నదంటే నాకూ తృప్తిగా ఉండేది.

బియ్యేలో చేరాను నేను.

ఫస్ట్ టెరమ్‌లోనే ఒకరోజు కారిడార్‌లోనించి హడావుడిగా వెళ్ళుతూ ఒక అమ్మాయిని ఢీకొన్నాను. నా కప్పటికీ బాగా గుర్తుంది. పువ్వులపరికిణీ కట్టుకుని తెల్లని ఓణీ వేసుకుని వున్నదామ్మాయి. కించిత్ కోపమూ దుఃఖమూ మిళితమైన కళ్ళతో నావైపు క్షణంసేపు చూసి కింద పడిన పుస్తకాలు తీసుకుని ఎప్పట్లా తలవంచుకుని గబగబ వెళ్ళిపోయింది. నా చెంప పగులుతుందో, నా నెత్తిమీద తిట్ల వర్షం కురుస్తుందో అనుకుంటూ భయపడుతున్న నాకు ఆశ్చర్యం కలిగింది. సన్నగా నాజూగ్గా, సౌమ్యంగా వున్న ఆ అమ్మాయినీ, ఆమె క్షమా బుద్ధినీ నేనెప్పుడూ మర్చిపోను.

అంత అజాగ్రత్తగానడిచినందుకు చాలా ఫీలయ్యాను. ఆమె నా క్లాసేగానీ గ్రూపు మటుకు వేరని తెలిసింది – కాలేజీలో అప్పుడప్పుడు కన్పిస్తుండేది. ఆమె కన్పిస్తే ఏమిటో హాయిగా – ఎంతోతృప్తిగా అన్పించేది నాకు. ఆమెమటుకు ఎప్పుడూ ఎవ్వర్నీ తలెత్తి చూసేదికాదు. ఎవ్వరూ ఫ్రెండ్సుకూడా వుండేవారు కాదేమో మరి. ఒక్కతే తలొంచుకుని వెళ్ళిపోతుండేది. రోజంతా అట్లా తలవంచుకుని ఎట్లా వుండేదో, క్లాసులో పాఠంకూడా అట్లాగే ఎట్లావింటుందో నాకసలు అంతుపట్టేది కాదు.

అసలువిషయం.

ఒకరోజు మామయ్య నన్ను పిలిచారు.

'బాగా చదువుకుంటున్నావా గోపాల్ ! క్లాసు వస్తుందంటావా ? మీ మేథమేటిక్స్ లెక్చరరు ఎవరన్నావూ ?' అంటూ కుశలప్రశ్నలు వేశారు.



'నళినిని గురించి నీ అభిప్రాయం ఏమిటి గోపాల్ !' అని అడిగారు మాటల మధ్యలో:

ఆయనంటే నాకు చెప్పలేని గౌరవం.

ఆశ్చర్యాన్ని అణుచుకుంటూ చెప్పాను:

'నళినికేం మామయ్యా ! మంచిపిల్ల – చక్కగా వుంటుంది. నవనీతంలాంటి హృదయం కలది. అమాయకురాలు, కాకపోతే కొంచెం పెంకెతనం' అని.

'అందుకేరాబాబూ ! నాబాధ. మిగిలిన పిల్లలనుగురించి నా కాట్టే బెంగలేదు. వాళ్ళింత అమాయకులూ కారు. అంత పెంకెవాళ్ళూ కారు. గంతకుతగిన బొంత అన్నట్టు వాళ్ళకెవరో దొరకకపోరు. వాళ్ళ పెళ్ళిళ్ళనుగురించి బాధలేదు. ఏ ఉద్యోగమో చేసుకునైనా బ్రతగ్గలరు. కానీ ఈ నళిని ! రాత్రీపగలూ దీనిగురించే బాధపడుతున్నాను. ఇంత ఆస్తితోకలిపి ఈ అమాయకురాలిని పరాయివాళ్ళ చేతుల్లో చూస్తూ చూస్తూ పెట్టటానికి మనసొప్పటం లేదురా' అని ఇదయ్యారు ఆయన.

ముచ్చెమటలు పోస్తున్నాయి నాకు. ఏం చెప్పను నా అవస్థ. నోట మాట రావటంలేదు.

మళ్ళీ మామయ్యే అన్నారు.

'గోపాల్ ! నీమీద నాకు నమ్మకమున్నది. నువ్వు యోగ్యుడివి, శ్రద్ధాళువువి. నళినిబాధ్యత నీకు అప్పజెప్తున్నాను. దాన్ని నువ్వు పెళ్ళిచేసుకో.'

నేను ఖంగారుపడ్డాను. ఏం చెప్పాలి అని తోచలేదు.

'సందేహించకురా. పెద్దవాణ్ణో చిన్నవాణ్ణో నీమంచి కోరినవాణ్ణి. నోరుచాచి అడుగుతున్నాను. నామాట విను బాబూ– దానిబాధ్యత నువ్వుతీసుకో – దానిపెంకెతనానికి నీ క్షమాగుణ మొక్కటేమందు' అంటూ నా చేతులు పట్టుకున్నారు మామయ్య.

నా నవనాడులూ క్రుంగిపోయాయి. ఆయన అభ్యర్థన ఎట్లా త్రోసిపుచ్చను ? నాకు నవజీవితం ప్రసాదించిన ఆ ఉత్తముని మాట ఎట్లా కాదనగలను ? కృతజ్ఞత చూపుకోటానికి ఇంతకంటె మంచి అదును దొరకదు, కానీ నా మనస్సు ఒప్పుకోవటంలేదు. కళ్ళు మూసుకున్నా తెరిచినా ఆ పువ్వులపరికిణీ అమ్మాయే కన్పిస్తోందీమధ్య. పీఠంమీద అధివసించిన దేవి ఆ అమ్మాయి. మరి ఇప్పుడేం చెయ్యను? నా కర్తవ్యం ?

వెంటనే నిశ్చయించుకోక తప్పలేదు. ఎదురుగా నా చేతులు పట్టుకుని సమాధానం కోసం నిరీక్షిస్తున్నారు మామయ్య.

'అంతమాటెందుకు మామయ్యా! నా చదువు పూర్తి కానీండి - చూద్దాం. మీరు ప్రాధేయపడటమేమిటి నా దగ్గర. నన్ను ఆజ్ఞాపించాలి గాని' అన్నాను సాధ్యమైనంత మామూలుగా.

మామయ్య పొంగిపోయారు.

'నీ కిష్టమేగదా బాబూ! అలాగే నీ చదువు పూర్తి కానీ. ఎంత కావలిస్తే అంత చదువుకో. పెళ్ళికేం తొందరలేదు, నువ్వు మాటిస్తే చాలు' అన్నారు.

'నాకు ఇష్టంలేద' ని నోరుతెరిచి చెప్పలేకపోయాను. ఉత్త అసమర్థుడిని.

అరుణా! ఆ విధంగా ఆనాడే నాకు నేనై మరొకరికి అమ్ముడు పోయాను. అంతరాత్మను వంచించుకున్నాను. పరాధీనుణ్ణి, పరభాగ్యోప జీవిని అయిపోయాను.

నళినికి తగిన వరుడిని కావడంకోసం నన్ను అమెరికా పంపించారు మామయ్య. ఖర్చంతా నళినితాలూకు ఆస్తిలోదే. బంధం ఇంకా ఇంకా బిగిసిపోతోంది. నళినిని నేను చేసుకోక తప్పదు. ఏదేవుడు నా కడ్డుపడతాడు? వ్చ్ లాభంలేదు - నేను స్వయంబద్ధుణ్ణి - మనస్సంతా నళిని మీద కేంద్రీకరించాలని వ్యర్థప్రయత్నం చేశాను. అంతరంగంలో హోరాహోరీ పోరాటం, మొదట్లో నళినిదగ్గర్నుంచి ఉత్తరాలే వచ్చేవికావు. అథవా వచ్చినా ఏవో రెండుముక్కలు రాసేది ఎవరో బలవంతం చేసినట్టు పెడసరంగా. ఇంతాచేసి నళిని కిష్టంలేదేమోనని అనుమానం వచ్చేది. కంచుకాగడా పెట్టి వెదికిచూసినా తన ఉత్తరాల్లో అనురాగంగానీ ఆప్యాయతగాని కన్పిస్తే ఒట్టు. ఎందుకుంటుంది? నాలాంటి సామాన్యుణ్ణి ఆ ఆగర్భ శ్రీమంతురాలెలా ప్రేమిస్తుంది?

అరుణా! నాదేవీ! నా ప్రాణసఖీ!

నన్ను మీరు ఎగతాళి చేయచ్చు. 'ఆనాడే మనసు విప్పి మామయ్యతో చెప్పేయలేకపోయారా? ఎంత పిరికివారు' అని.

అవు నరుణా! నేను పిరికివాణ్ణి. ధర్మం విషయంలో మరీను.

మీకు విసుగ్గావున్నదేమో - ఇంక ముగించేస్తాలెండి.

క్రమక్రమంగా నళిని ఉత్తరాల్లో మార్పు కన్పించటం మొదలుపెట్టింది. తను మెట్రిక్ చదువుతున్నాననీ, టీచర్ ఎంతో మంచిదనీ, తనచేత ఉత్తరాలు రాయిస్తోందనీ, ఈమధ్య తన కెంతో ఉత్సాహంగా ఉంటోందనీ రాసేది. ఉత్తరాలనిండా టీచర్ ప్రశంసలే వుండేవి. ఆవిడ నవ్వితే ఎంత బావుంటుందో పాటపాడితే ఎంత బావుంటుందో... అన్నీ వివరంగా రాసేది.

ఆ టీచర్ గురించిన వివరాలు రాయమని యాదాలాపంగా రాశా నొకసారి. ఆవిడమీద నా కేమీ ఇంటరెస్ట్ లేదు నిజానికి. కానీ నేను ఆవిడమాట ఎత్తకపోతే నళిని చిన్నబుచ్చుకుంటున్నదని తెలిసింది. అందుకని - కేవలం తన సంతోషంకోసం - రాశా సలాగ.

అడిగిందే తడవు - ఏనుగెక్కినంత సంబరపడుతూ టీచర్ వివరాలన్నీ రాసి ఇద్దరూకలిసి తీయించుకున్న ఫొటోకూడా పంపించింది నళిని. బహుశా తనలాంటి ముగ్ధ తనేగాని మరొకళ్ళుండరేమో -

ఇంతకీ...

ఆ ఫొటోలోవున్న టీచర్ ఆనాటి ఆ పువ్వుల పరికిణీ అమ్మాయి. ఇంకా ఎలా గుర్తుందంటే ఏం చెప్పను! రోజూ రాత్రి పడుకోబోయేముందు గుర్తుకు వచ్చేది ఆ చిన్నారి మొహమే.

ఇంక నా పరిస్థితి ఏమని చెప్పను? నళిని రాసే ఉత్తరాలు ప్రాణప్రదంగా దాచుకుని మీ గురించిచదివి మురిసిపోయేవాడిని. ఫొటో సరేసరి.

నేను మనదేశం తిరిగి రావటానికి ముఖ్య కారణం మీరూ, నళినితో మీ స్నేహం. విద్యార్థిదశలోకంటే మీ వ్యక్తిత్వం ఇప్పుడు నిండుదనాన్ని సంతరించుకున్నది. అప్పటిలా చూడగానే బెదిరిపోవటంలేదు.

నేను కృతఘ్నుడిని. దగాకోరుని - స్వార్థపరుడిని. వెయ్యిసార్లు తిట్టండి అరుణా నన్ను. కాస్త శాంతి కలుగుతుందేమో నాకు. ఈ ద్వైధీభావసంఘర్షణకు తట్టుకోలేకుండా వున్నా నరుణా! నేనూ మనిషి నేగదా. నేను నేనుగా ఇష్టమైతేనే... మనస్ఫూర్తిగా చెప్పండి. నళినిమీద నాకు ఎంతో వాత్సల్యం వుంది. కానీ తనను పెళ్ళిమటుకు చేసుకోలేను. ఈ దేశం వచ్చాక ఆ విషయం ఖచ్చితంగా తెలిసింది. ఇక ఉపేక్షించను. మామయ్యతో చెప్తాను. మనసులు కలవకపోయిన తర్వాత మనువు జరగటం ఆయనకూడా ఒప్పుకోరు. నా ప్రయత్నమూ, మీ ప్రయత్నమూ వృథా అవనే అయ్యాయిగదా - నళినిలో ఆశించిన మార్పేమీ రాలేదుగదా. ఆమెకి నేనంటే ఇష్టమేం లేదని అర్థమై ఉంటుంది మీకీపాటికి.

తనని చేసుకోలేనని నళినితో చెప్పాను. మీ అంగీకారమో అనంగీకారమో తీసుకుని ఢిల్లీ వెళ్తాను. తెలిసో తెలియకో నళినీ మీరూ నా జీవితంలో ప్రవేశించారు. నా కిష్టంలేక ఒకరూ, నన్ను ఇష్టపడక మరొకరూ నాకు దూరమైతే ఇంకే స్త్రీనీ దగ్గర చేసుకోలేను - నా అశక్తత నాకు తెలుసు.

అరుణా! మధురరసాకృతీ! ఈ నిర్భాగ్యుడి మనస్సునిండా అలముకొన్న దివ్య ప్రణయ భావనా! ఎడారి అయిపోతున్న నా బ్రతుకులో అల్లుకున్న ఏకైక ఆనందలతా! నన్ను అపార్థం చేసుకోవద్దు. నాలో ఉన్న లోపమల్లా అసమర్థత ఒక్కటే. దాన్ని పోగొట్టుకోవటానికేగదా ప్రయత్నిస్తున్నాను.

నువ్వు నా ఆత్మీయురాలివని భావించి ఏమిటేమిటో రాశాను. ఒక్క ఊహ దాచుకోలేదు - తప్పయితే క్షమించవా? అసలు అప్పుడు నువ్వు నాకు ఆరాధ్యదేవ

తవు కావటమేమిటి? అంతరించినఆశ చిగుళ్ళువేసేటట్లు మళ్ళీ ఇలా కన్పించటమేమిటి? సరే అఘటన ఘటనా సమర్థుడైన పరమేశ్వరుని ఇచ్ఛ ఎలావుందో - అల్పుణ్ణి నేనెలా ఊహించగలను.

రేపు సాయంకాలం మీ ఇంటికివస్తాను. ఈ ఉత్తరానికి సమాధానం తెలుస్తుందనే ఆశతో వస్తాను -

శుభాకాంక్షలతో...

గోపాల్."

నిలువునా వణికిపోయింది అరుణ...

"ఏఁవిటక్కయ్యా! ఇంకా అలాగే వున్నావు. త్వరగా తయారవు మరి. పిక్చర్ కి టైమైపోతోంది. వాళ్ళంతా ఎప్పుడో తయారయ్యారు" అంటూ మేడ మీదికి వచ్చాడు శంకరం.

సెలవులకు ఇంటికి వచ్చాడతను.

ఆ ఇంటి తోబుట్టువుల మధ్య అరమరికలనేవి వుండవు సాధారణంగా.

"ఒరే నువ్వు నళినిని చూశావా?" అని అడిగింది అరుణ.


"ఆఁ చూడకేం - చూశాను. పైగా - ఆవిడ గురించి నాకు చెప్పావుకూడా - వాళ్ళ బావగారెవరో అమెరికా వెళ్ళొచ్చారనీ త్వరలోనే పెళ్ళనీ అన్నావుగా!" అన్నాడు కుతూహలంగా.

"ఏమిటోరా. నాకు మతిపోతోంది. ఇదుగో నళిని బావగారు రాసిన ఉత్తరం- నేను పిక్చర్ కి రాలేనురా - సారీ..." అంటూ ఆ ఉత్తరం అతనిచేతిలో పెట్టింది అరుణ.

* * *

నళిని సీరియస్ గా ఆలోచిస్తోంది.

"వెళ్ళిపోవాలి ఈ ఇంట్లోనించి- ఉండకూడదిక. చిటచిటలాడే అక్కయ్యల మొహాలూ ధుమధుమలాడే తమ్ముళ్ళ మొహాలూ - భరించడం ఎంత కష్టమో అనుభవించినవాళ్ళకుగానీ అర్థంకాదు. వెంపుడు వెళ్ళటం తనతప్పా ఏమిటసలు? ఛీ- ఎవరికీ అక్ఖర్లేని బతుకు బతికేకంటే ఎందులో




నన్నాపడి చస్తే మంచిది. వీళ్ళందర్నీ మరిపించేటట్లు - ఈ ఇంటికి - అశాంతికి దూరంగా తీసుకువెళ్తాడని ఆశపెట్టుకున్న బావకు తనేమీ కాదిక" అనుకుంటూ నిట్టూర్చింది.

"అయినా దేవుడులాంటి బావను నేనే అపార్థం చేసుకున్నాను. డబ్బుకోసం చచ్చినట్లు పెళ్ళిచేసుకుంటాడనుకున్నాను. నాకీ శాస్తి జరగాల్సిందేలే" అనుకుంది.

"ఎంత ప్రయత్నించినా అరుణా టీచర్ చెప్పిన ప్రేమతత్వం నా ఒంటికి ఎక్కటల్లేదే. ప్రతివాళ్ళూ మంచివాళ్ళే అనుకోమంటుందావిడ. అదెలా సాధ్యం? పొంగిపొరలే ప్రేమలో భగవంతుడున్నాడంటుంది. కానీ నా ప్రేమ ఎలా వ్యక్తం చేయాలి? ఎవర్ని చూసినా ఏదో అయిష్టంగా, కోపంగా, నా సొమ్ము కాజేయడానికే ప్లాన్ చేస్తున్నట్టూ, విషపుచూపులు చూస్తున్నట్టూ అన్పిస్తుందెందుచేత? వాళ్ళందర్నీ ఆప్యాయతతో చూడటం ఎలా కుదురుతుంది? ఉహుఁ ఇదేం లాభం లేదు. ఇంకొన్నాళ్ళు ఓపికపడితే మైనారిటీ తీరుతుంది. ఆస్తి అంతా చేతిలోకి వస్తుంది. అప్పుడు నాదే రాజ్యం. ఎక్కడైనా హాయిగా కడుపులో చల్ల కదలకుండా, కాలుమీద కాలేసుకుని వుండొచ్చు. ఇల్లు కాని ఈ ఇంట్లో ఇంక ఉండటం అసంభవం మెడ్రాసులో ప్రాణస్నేహితురాలు సువర్చల వుందిగా వెంటనే బయల్దేరి తన దగ్గరికి వెళ్ళిపోవాలి. పెద్ద ఈ బావేనేమిటి నన్నుద్ధరించేది," అనుకుంది. మళ్ళీ అంతలోనే ఇంకో ఆలోచన.

"వాళ్ళింట్లో ఎన్నాళ్ళని ఉండటం? వాళ్ళన్నయ్య కాస్తంత పైలా పచ్చీసు మనిషిగదా - ఆఁ ఫర్లేదులెద్దూ. సువర్చల మంచిది. అంతే చాలు" అనుకుంది. అంతలో బావ గుర్తుకొచ్చాడు.

"హుఁ బావ! దిక్కులేనివాడు. నాన్నగారి మంచితనంవల్ల - నా డబ్బుతో - చదువుకొని పైకొచ్చాడు - ఎంత ఆశ్చర్యం - డబ్బు అక్ఖర్లేదన్నమాట-పాపం- బావని దేవుడే రక్షించాలి" అనుకుంది.

నళిని మనస్సులో ఏదో సంచలనం-ఇదీ అని చెప్పలేనిది, ఇదివరకెప్పుడూ కలగనిది-బయల్దేరింది.

"నా డబ్బుకోసం కాకుండా మనసారా నేను కావాలనుకునే వ్యక్తి, నా మనస్సులో మధురోహాలు సృజించగల వ్యక్తి-ఎప్పుడైనా తటస్థపడతాడా? నాకంత అదృష్టమా అని, చటుక్కున లేచింది.

తన బట్టలూ, బంగారు వస్తువులూ తన దగ్గరున్న డబ్బూ తీసుకున్నది. అందరూ లోపల కూర్చుని సరదాగా కబుర్లాడుకుంటున్న వేళ చూసి గబగబా బయటికి వచ్చేసింది.

నాలుగడుగులు వేసిందో లేదో గేటు దాటకుండానే ఒక యువకుడు ఎదురు పడ్డాడు.

నళిని మొహం ముడుచుకుపోయింది.

"హల్లో నళినీ! ఎక్కడికో బయల్దేరినట్టున్నారే," అని ఆశ్చర్యపోయా డతను.

"మా ఫ్రెండింటికి..." ఆమె మాట తడబడింది.

"ఏవూ రేమిటి?"

"మిస్టర్! నా సంగతంతా నీ కెందుకు. మీ రెవరికోసం వచ్చారు? మా తమ్ముళ్ళుగానీ బావగానీ కావాలా? లోపలికి వెళ్ళండి," అన్నది కోపం అణుచుకుంటూ — నళిని.

"నో — నో — వాళ్ళెవరూ అక్కర్లేదు — నాకు మీరేకావాలి. అ — ఐ మీన్ నేను మీకోసమే వచ్చానండీ," అంటూ కొంటెగా నవ్వే డతను.

మింగేసేటంత కోపంగా చూసి పళ్ళు కొరికిందామె.

"మీతోమాట్లాడాలి. కొంచెం గుర్తు చేసుకోండి నన్ను. నా పేరు శంకరం — మీ అరుణా టీచర్ తమ్ముణ్ణి నేను."

"నాతో...నాతోనా...?"

"అదేమిటండీ అంతకంగారుపడతారు?"

"కంగారా? అబ్బె—అదేంలేదు. రైలు టైమై పోతోంది. నేను వెళ్ళాలి."

"అలాగాండీ — ముందు ఆ సూట్ కేస్ లోపల పెట్టండి మేడమ్. మీవాళ్ళెవరో ఇటువేపు వస్తున్నట్టున్నారు. అనవసరంగా పట్టుబడిపోతారు మీరు — ఊఁ క్విక్ —" పేలగా అన్నా డతను.

కళ్ళు విప్పార్చి చూసింది నళిని ఆ ఆగంతకుణ్ణి.

"సరే. మీరుకూడా రండి. నుంచునే మాట్లాడుతున్నారు," అంటూ అతన్ని తన గదిలోకి తీసుకువెళ్ళింది — సూట్ కేస్ మంచంకిందికి తోసేసింది.

అతను నవ్వాపుకున్నాడు.

"అవునూ — ఇంట్లోంచి ఎందుకు పారిపోతున్నారు మీరు? రక్షణ కవచమైన ఇల్లు వదలాలనే దుర్బుద్ధిపుట్టిం దేమిటిమీకు? రచ్చగెలుద్దా మనుకున్నారా? బయటి ప్రపంచం ఎలావుంటుందో ఏమైనా తెలుసా నళినీ మీకు! అంతా మా అక్కయ్యలాగే వుంటారనుకున్నారా?" అన్నాడు.

ఆమె గొంతులో తడి ఆరిపోయింది.

"నే నేం పారిపోవటంలేదు. నా కంత ఖర్మేం పట్టలేదు. దర్జాగా వెళ్ళుతున్నాను. కొన్నాళ్ళు రిలీఫ్ కోసమని ... మా సువర్చలను చూద్దామనీ..."

అతను నవ్వేశాడు. "పాపాయిని మందలించే పెద్దమనిషిలా — ఈ అధికారం ఎవరిచ్చా రితనికి? నన్ను మందలించటానికి ఎన్నిగుండె లున్నాయి. కానీ ఇతని మాటల్లో అధికారానికి తోడు లాలనకూడా వుంది. అతనలా అంటూంటే—అలా నవ్వుతూంటే...ఎంతో బావుంది," అనుకుంది నళిని.

"ఏమండోయ్! నేను సైకాలజీ వెలిగించాను యూనివర్సిటీలో. నా కళ్ళు కప్పాలని ప్రయత్నించకండి. దొరికిపోతారు. ఏమైతేనేం— నేను టైముకు వచ్చాను. ఔనా!" అన్నాడు అతను.

"ఉద్ధరించారు. నా ప్లానంతా పాడు చేసి..." అనుకుంది కసిగా.

"మాట్లాడరేమండీ! మిమ్మల్ని రక్షించుకున్నానా లేదా?"

"ఎంత అధికారం — ఎంత నిర్భయం — ఇతన్ని — ఇంక ఉపేక్షించకూడదు" అనుకుంది.

"మీ రెవరు నన్ను రక్షించుకోవటానికి? నేను మీ కేమౌతానసలు. అంతమంచి అక్కయ్యగారికి తమ్ముడా మీరు? ఆడవాళ్ళ మీదనే గౌరవం లేనట్లుందే. లేకపోతే ఏమిటీ మాటలు, నా గదిలో కూచుని. మా బావనుపిల్చి బుద్ధిచెప్పించమంటారా?" తీవ్రంగానే అన్నది కానీ ఎప్పటిలా అహంభావం తొణికిసలాడలేదు ఆమె కంఠంలో.

అతను అల్లరిగా నవ్వాడు.

"ఇంత సేపూ మీ గదిలోకూచుని మాట్లాడనిచ్చారు. థాంక్సండీ నళినీ కుమారీ! అలాగే మీ లైఫ్‌లోకూడా చోటిచ్చారంటే..."

అతనిచెంప ఛెళ్ళుమన్నది.

"యూ రాస్కెల్ — గెటౌట్ ఫస్ట్ — ఐసే — ఎంతపొగరు — నా డబ్బుచూసేనా ఇంత పన్నాగం..." ఆమె ఆవేశంతో ఊగిపోయింది.

సున్నితంగా చెంప తడుముకుని ఆమె కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు శంకరం.

"సారీ డియర్! నేను పొగరుగా అడిగానా? మీరు అపోహపడుతున్నారు. పోనీ ఎలా అడగాలో చెప్పండి. నాకు డబ్బు అక్కర్లేదు. మీరు కావాలి — మీరే కావాలి. మీ ఈ స్వభావమంటే నాకు చాలా ఇష్టం" గబుక్కున ఆమె రెండు భుజాలమీదా చేతులువేసి చెంపకుచెంప ఆనించి — వదిలేశాడు.

నిలువెల్లా జల్లుమనగా క్షణంసేపు అప్రతిభురాలై నిలబడిపోయిం దామె — తర్వాత ఆదుర్దాగా అడిగింది.

"మరి... మరి... డబ్బు అక్కర్లేదా? ఎట్లా నమ్మటం? నిజంగా నేనుకావాలా? నిజంగానా?''

"నిజంగా మీరే కావాలి. నన్ను నమ్మండి నళినీ! మీ డబ్బుమాట కాసేపు మర్చిపొండి. అప్పుడుగాని మీ మనస్సు స్థిమితపడదు. మనిద్దరం మామూలు మనుషులం. అంతే — మీ సాహచర్యం నాకు కావాలి? ఈ ఉద్దేశం మా అక్కయ్యకు కూడా తెలియనీయకుండా నాలోనే దాచుకున్నాను. బయటపెట్టినా లాభంలేదని

తెలిసింది. అక్కయ్య చెప్పిందిలెండి మీకు మీ బావగారున్నారని. సరేలెండి– ఇప్పుడదంతా ఎందుకుగానీ – నన్ను నమ్ముతున్నారా లేదా? చెప్పండి" అన్నాడు శంకరం.

"మీ రన్నమాట నిజమే – డబ్బుమాట మర్చిపోతేగాని నాకు శాంతిగా ఉండదేమో. నా నిశ్చయం వినండి. ఆస్తిఅంతా చేతికి రాగానే ఈ వూళ్ళో పెట్టబోతున్న ఆడపిల్లల కాలేజీకి ఇచ్చేస్తాను. ఇప్పుడు కూడా నే నంటే ఇష్టమేనా మీకు? నా సాహచర్యం కావాలామీకు? చెప్పండి" అన్నది నళిని.

అతని కళ్ళల్లో మెచ్చుకోలు పొంగిపొర్లింది. ఆ ప్రవాహంలో ఆమె తడిసిపోయింది.

"నన్ను నమ్మటం లేదుకదూ నళినీ! నేను మిమ్మల్ని నమ్ముతున్నాను. సరేనా? మీ ఆస్తి నిలా సద్వినియోగంచేస్తున్నందుకు నా కెంతో సంతోషంగా, గర్వంగా ఉంది తెలుసా?" అన్నాడతను.

కొద్దిగా తలవంచుకుని, మనస్సులో పశ్చాత్తాపం పులుముకుని, వణుకుతున్న పెదవులతో అన్నది నళిని:



"ఇంకా ఎందుకు నన్ను మన్నిస్తారు ? ఏకవచనంతో పిలవండి," అని. శంకరం ఆనందం అవధులు దాటింది. ఆ లజ్జా మధు రాభిరామమూర్తిని కళ్ళార చూస్తూ అప్పుడనుకున్నాడు :

"అరుణక్కయ్య, గోపాల్ గారు ఎవరూ కొన్ని ఏళ్ళుగా సాధించలేని పనిని తను కాస్సేపట్లో సాధించగలిగాడు. నళిని ఇలా ఉండగలదని వాళ్ళెప్పుడూ ఊహించికూడా వుండరు. మొత్తానికి నా అదృష్టం బావుంది. ఈ ద్వితీయ సత్య భామ నాకు దక్కింది."

"నాకు సమాధానం చెప్పకుండా ఇదేం మాట ?'' అన్నాడు ఏమీ తెలియనట్టే.

ఆమె ఇంకా తలొంచేసుకుని కాలి బొటనవేలితో నేలరాస్తూ "టీచర్ గారితో చెప్తాను తర్వాత – మీతో చెప్పలేనబ్బా – నాకు సిగ్గేస్తుంది," అన్నది.

"గుడ్ – ఫేవరబుల్ రిప్లై ఇస్తారు గదూ – మళ్ళీ కోపమొచ్చి రైలెక్కేసేరు గనక. మెడ్రాసు వచ్చి వెతుక్కోలేక చచ్చిపోతాను. నామీద దయతలిచి ఆ పని మాత్రం మానెయ్యండి. గోపాల్ గారికి మీ ప్రయాణం సంగతి తెలుసు. మీ ప్రతి కదలికా వెయ్యి కళ్ళతో గమని స్తూనే వున్నారాయన. ఇప్పటి కాగండి. హనీమూన్ ట్రిప్‌లో మీ ఫ్రెండు దగ్గరికి వెళ్దురుగాని. నే నింక వస్తాను" అంటూ వెళ్ళిపోయాడు శంకరం.

గిలిగింతలు పెట్టినట్లైంది నళినికి. 'అయ్యో! ఆయన్ని అనవసరంగా కొట్టాను. నా కసలు బుద్ధిలేదు –' అను కుంటూ ఆ చెయ్యి చెంపకు అన్చుకున్నది అప్రయత్నంగా. 'బావకు తన ప్రయాణం సంగతి ఎలా తెలిసిందో – వీళ్ళిద్దరూ లాలూచీ ఎప్పుడైనారు ?' అనుకుని సిగ్గు పడింది, ఆశ్చర్యపడింది.

మర్నాటి సాయంకాలం.

మేడమీద తన గదిలో కూర్చుంది అరుణ. చుట్టూ ఆహ్లాదకరమైన వాతావరణం వెల్లివిరుస్తోంది. కొంచెం అవతలగా పిట్టగోడచుట్టూ కొబ్బరిచెట్లు గాలికి తలలూగిస్తున్నాయి. ఈ లోకంతో తనకేం సంబంధం లేనట్లు ఉత్సాహంగా పరిగెడుతోంది దూరంగావున్న ఏరు. మేడమీది నించి చూస్తుంటే ఆ దృశ్యం అతి రమణీయంగా కన్పిస్తోంది.

కిందనించి మల్లెపూలమ్మేవాడి కేక విన్పించింది. అలవాటుప్రకారం మేడ దిగ బోయి మళ్ళీ ఆగిపోయింది, 'పూలువద్దు లెద్దూ – ఇవాళ' అనుకుంటూ!

మెట్లమీద అతను – గోపాల్ – "పైకి రావచ్చునా అండీ ?" అని మర్యాదగా అడిగాడు.

"రండి. నా అనుమతి దేనికి ఇప్పుడు ? ఎలాగూ వస్తానని వ్రాశారుగా – అందుకే ఎదురుచూస్తున్నాను" ఇంటి పైకప్పుకేసి చూస్తూ అన్నదామె.

"నిజంగా ?" అంటూ పైకివచ్చా డతను.

ఆమె ఏం మాట్లాడలేదు.

"మీ జవాబుకోసం వచ్చాను అరుణా!"

కాలివేళ్ళు కదిలిస్తూ కూర్చుందామె– తలైనా ఎత్తి సూటిగా అతన్ని చూడనే లేదు.

"జవాబు చెప్పరా ? చెప్పదల్చుకో లేదా అసలు ?" ఖిన్నుడైపోయి అడిగా డతను.

అరుణ కదిలిపోయింది.

"ఏం చెప్పమంటారు ? నన్నెందుకీ చక్రబంధంలో బంధించారో చెప్పండి ముందు. నేను నిలవలేక పోతున్నాను. నా ఖర్మకాకపోతే కాలేజీడేస్ నించీ నన్ను గుర్తుపెట్టుకోమని ఎవరు చెప్పారండీ మీకు ?" అంటూ వంచినతల ఎత్తిందామె. ఆ కళ్ళనిండా అలజడి కన్నీళ్ళూ తొణికిస లాడుతున్నాయి.

"క్షమించండి. అయితే – మిమ్మల్ని ఇంత కష్టపెడుతున్నా ననుకోలేదు. మీ జవాబు ఏమిటో చెప్పండి. చాలు – ప్లీజ్"

"విని ఏంచేస్తారు ?"

అతను విచారంగా నవ్విఊరుకున్నాడు– అయితే అరుణ తనుకోరుకున్న సమాధానం చెప్పటంలేదన్నమాట అనుకున్నాడు. అతనిగుండె గుబగుబలాడింది.

"మరెందుకీ కుతూహలం ? ఏం చెయ్య లేనప్పుడు ?"

"అంటే...అంటే ?...ఒప్పుకుంటు న్నావా అరుణా !" ఆత్రంగా కుర్చీలో నించి ముందుకు వంగాడతను,

ఆమె బరువుగా నిశ్వసించింది. "మీకు ధర్మమంటే లక్ష్యముంది. అవునా ?" అన్నది.

"అయితే... ?"

"నళినిని చేసుకోవటం మీ ధర్మం–అలాం టప్పుడు– మీ బుద్ధి ఎందుకిలా వక్రించింది? నామీద నాకే అసహ్యంగా వుందిప్పుడు. నేను మీకు కన్పించటం పొరపాటైంది. అదీ బుద్ధిపూర్వకంగా చెయ్యలేదు నేను – నళిని బలవంతంవల్లనే ... ఇలా అవుతుం దనుకోలేదు," అన్నది.

"నాకు ఒక్కమాట చెప్పండి – మీ మనస్సులో నా గురించి ఏ ఉద్దేశమూలేదా? లేదని నిశ్చయంగా చెప్పగలరా మీరు?"

"ఇప్పు డెందుకా ప్రశ్న?"

"మరి ఏ ప్రశ్న కావాలి?"

"దయచేసి నన్ను విసిగించకండి మీకు పుణ్యముంటుంది. నే నెటూ చెప్పలేను – చెప్పలేనని మీకుతెలుసు."

"ఎందుకని చెప్పలేవు? అదే అడుగు తున్నాను. ఇలా నావైపు చూసి మన స్ఫూర్తిగా చెప్పు అరుణా!" తనను తాను మరిచిపోతూ ఉద్రిక్తుడైపోతూ ఏకవచ నంతో పిలిచేస్తున్నాడు గోపాల్.

"ఆ అమాయకురాలు నళిని మీ మీద ఆశలు పెట్టుకుని వుంది. తన బాధ్యత మీ మీద వున్నది. మీ రామాట మర్చిపోతు న్నారు."

కుర్చీలోనించి దిగ్గునలేచా డతను. అతని కళ్ళు మెరుస్తున్నాయి.

"నిజమా అరుణా! నిజమా! నళిని వల్ల నేనా మీ అభ్యంతరం? నేనంటే మీ కిష్టమే నన్నమాట. అవునుగదూ? మీకు మల్లెలంటే చాలా ఇష్టమని నాకు తెలుసు. ఇదిగో ఈ మల్లెచెండు టేబిల్ మీద పెడుతున్నాను. నేను ఇష్టమైతే తీసుకోండి. లేకపోతే ... ఏమో మీ దయ."

చెక్కుచెదరకుండా అన్నది అరుణ.

"ఆ చెండు తీసుకోవటానికి అర్హత వున్న అమ్మాయి నళిని ఒక్కతే. మీ రివ్వకపోతే నేను వెళ్ళి ఇచ్చి వస్తాను."

"ప్చ్. లాభంలేదు. నళిని ఈ మల్లె చెండు తీసుకోదు."

"ఏం - ఎందుకని?"

"మీకు తెలియదూ? నళినికి సన్నజాజులంటే ఇష్టంగదా - ఇందాక మీ తమ్ముడు శంకరం జాజిపూలమాల కొన్నాడులెండి - పూలదుకాణం దగ్గర కలుసుకుని చాలాసేపు సంప్రదించుకున్నాం మేమిద్దరం."

"ఏమిటి? మీరనేది?" సంభ్రమంగా అడిగింది.

"మీ తమ్ముడు మనకు సహాయం చెయ్యటమేకాదు తనకోరికా చెల్లించుకున్నాడు. కాసేపట్లో మీకు అన్ని వివరాలూ తెలుస్తాయి మేడమ్ - ఇన్నాళ్ళూ ఒక్కశిష్యురాలే గాబోలు మా నళిని తమరికి. ఇకనించి మరదలుకూడానూ - ఎట్లా చూసుకుంటారో మరి. సరిగ్గా చూడకపోతే శిక్ష ఏమిటో తెలుసా? నళిని బాపగారిచేత మొట్టికాయలు తినుట," కొంటెగా అన్నాడతను.

సంతోషమూ సిగ్గూ సంభ్రమమూ ముప్పిరిగొనగా - అతన్ని ఏవేవో అడగాలనుకుని - సరిగ్గా అడగలేక సందేహం పేరుతో సిగ్గు దాచుకుంటూ అడిగింది "నేనిట్లా తటస్థపడకపోతే...?" అని.

"ఏం చేసేవాణ్ణో? అంటావు. అంతేనా ఆ అనుమానాలే పెట్టుకోవద్దంటున్నాను. అర్థమైందా? ఎబ్బే - ఎందుకర్థం అవుతుందీ బుజ్జి ట్యూబ్ లైటాయె."

మొహం ఎఱ్ఱగా అయిపోయిందామెకి.

"అన్నట్టు నీకో సంగతి చెప్పాలి - నళిని నాన్నగారికి నేనింత ఋణగ్రస్తుణ్ణి ఎందుకయ్యానంటే... ఆయనకీ నాకూ రక్తసంబంధం ఏమీ లేకపోవటమే. మా నాన్నగారూ ఆయనా ప్రాణస్నేహితులు. కన్నతల్లి కరువై సవితితల్లి దగ్గర నేను అవస్థ పడుతుంటే కేవలం స్వశాఖయుణ్ణి అయినంత మాత్రాన నన్ను తీసుకువచ్చి చదువు చెప్పించి ఇంతవాణ్ణి చేశారాయన - అందుకనే ఆయనంటే నాకు అంత భక్తి - నాభార్య నా తల్లిదండ్రుల నెలా గౌరవిస్తుందో నాకు పునర్జన్మ నిచ్చిన నళినీవాళ్ళ అమ్మగార్నీ అలాగే గౌరవించాలి - ఇది మటుకు మర్చిపోకూడదు. తెలిసిందా?" అన్నాడతను.

"అలాగే-అంతకంటే పుణ్యం ఏముంటుంది? అంత మంచివాళ్ళు లక్షలమందిలో ఎన్నదగినవాళ్ళు-ఆ మాట మీ భార్యకు నేను చెప్తాన్లెండి. ఇంతకీ మీ స్వంత నాన్నగారూ పినతల్లిగారూ ఎక్కడ?"

"కొంటి!" అంటూ ముక్కు పట్టుకోబోయి, ఆకోరికను మనస్సులోనే అణుచుకుని ఆమె ప్రశ్నకు సీరియస్‌గా సమాధానం చెప్పాడు:

"ఇద్దరూ మా వూళ్ళోనే వున్నారు. రేపు అక్కడికి వెళ్తున్నాను. మా ఆవిడతో ఇంకో మాటకూడా చెప్తారూ?"

క్రిందిపెదవి గట్టిగా నొక్కిపడుతూ "ఏమిటది?" అన్నట్లు చూసిందామె. "రేపు నాతో మా వూరికి రావాల్సి ఉంటుందని" అన్నాడతను. లజ్జతో ఎరుపెక్కిన చెక్కిళ్ళతో, వణుకుతున్న చేతులతో-"అలాగే" అంటూ టేబిల్ మీదవున్న పూలమాల అందుకున్నది అరుణ.

అప్పుడు గోపాల్ మందహాసం చేశాడు. గదిలో కనుచీకటి చెదిర్చి వెలుగులు విరజిమ్మిందా నవ్వు.

"ఆఁ ఆఁ అది తీసుకునే వరకే మీ బాధ్యత. దాన్ని జడలో అలంకరించడం మా హక్కు -" అంటూ ఆమె చేతుల్లోంచి పూలచెండు లాక్కున్నాడు. *

